క్లుప్తంగా

నేడు రేణుకా ఎల్లమ్మ బోనాలు

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సమీపంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో నేడు శ్రావణ బోనాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఉదయం నల్లకుంట డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీ తొట్టెల ఊరేగింపు ఉంటుంది. బోనాల వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా శంకర్

ముషీరాబాద్: నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.శంకర్ తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తనపై నమ్మకం ఉంచి రెండోసారి వైస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించారన్నారు. మైనార్టీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే మైనార్టీ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తానన్నారు. బాధ్యతలు అప్పగించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవితలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కవాడిగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ అన్నారు. భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలో కోక రవీంద్ర, డాక్టర్ జగన్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలకు ప్రతిపాదనలు రూపొందించి అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆంజనేయులు, కొమ్ము రాజేష్, శివ, రాముగౌడ్, వేణుగోపాలాచారి, మల్లేష్, భరత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు చేయూత



అంబర్‌పేట: వర్షాలతో ఇబ్బంది పడుతున్న పేదలకు తనవంతు చేయూతను అందిస్తున్నట్లు అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఇటీవల నరేందర్ నగర్‌లో ప్రమాదవశాత్తు కాలిపోయిన ఇంటి యజమాని కె.జయకు శనివారం నిత్యావసర వస్తువులు కార్పొరేటర్ అందజేశారు. ప్రమాదంతో అధైర్యపడొద్దని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. బస్తీ పెద్దలతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఆమనూరి సతీష్, లింగారావు, మహేష్‌ముదిరాజ్, నాగరాజ్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'పారిశుద్ధ్యంలో పాలక సంస్థలు విఫలం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పారిశుద్ధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ తీవ్రంగా విఫలమైందని జీహెచ్ఎంసీ, రాంకీల తీరుతో నగర ప్రజారోగ్యం ఆందోళనలో పడిందని' ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆరోపించింది. ఎప్పటికప్పుడు తరలించాల్సిన వ్యర్థాలు జనావాసాల మధ్యే ఉంటున్నాయని కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.హెచ్.రంగయ్య, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణలు విమర్శించారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల తరలింపునకు వందల కోట్లు తీసుకుంటున్న సదరు సంస్థ తూతూ మంత్రంగా పనిచేస్తోందని మండిపడ్డారు. శనివారం వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సమస్యపై గతంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు అనేక వినతిపత్రాలు అందజేశామని, వారు పట్టించుకోలేదని పేర్కొన్నారు.

అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు

మలక్‌పేట: అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ శశికిరణ్ ఆసుపత్రి నుంచి బాప్టిస్ట్ చర్చి వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం శాలివాహన నగర్‌లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌ను అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది సత్తిరెడ్డి, ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్, బీజేపీ నాయకులు ప్రవీణ్‌యాదవ్, సందీప్‌రెడ్డి, దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



గోల్నాకలో మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బిలాల్ మజీద్ వద్ద జరిగిన అన్నదానంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

అంబర్‌పేట: మొహర్రం వేడుకలు త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన మొహర్రం వేడుకలకు ఆయన హాజరయ్యారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహించుకున్నారు.

- పూలే విగ్రహం చౌరస్తాలో జరిగిన మొహర్రం వేడుకలకు మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి హాజరయ్యారు.
- అంబర్‌పేట డివిజన్‌లో జరిగిన మొహర్రం వేడుకల్లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ముషీరాబాద్: హిందూ, ముస్లిం ఐక్యతకు మొహర్రం ప్రతీక అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం మొహర్రం పండుగను ముషీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు.

- భోలక్‌పూర్ డివిజన్‌లోని బిలాల్ మజీద్, గుల్షన్‌నగర్, బడీ మజీద్ తదితర ప్రాంతాల్లో అన్నదానం, షర్బత్ పంపిణీ, సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిలాల్ మజీద్ వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, బిలాల్ మజీద్ ముతావలి దిల్‌ఖర్‌హుస్సేన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మక్బుల్, గబ్బార్, రహీం, శంకర్ పాల్గొన్నారు.



అడిక్‌మెట్‌లో షర్బత్ పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

- భోలక్‌పూర్ డివిజన్ ఇంద్రానగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖబీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన షర్బత్ పంపిణీ కార్యక్రమానికి బిజ్జి శత్రు ముఖ్య అతిథిగా హాజరై షర్బత్ పంపిణీ చేశారు. కాంగ్రెస్ నేతలు కన్నా డానియల్, శివశంకర్, రావుల శ్రీకాంత్, వేణు తదితరులున్నారు.
- ఆవాజ్ ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఏక్ మినార్ వద్ద షర్బత్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు హాజరయ్యారు. నాయకులు ధశరథ్, అజీజ్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.
- అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్‌లో జరిగిన షర్బత్ పంపిణీలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, సయ్యద్ అస్లాం, గురుదీప్‌సింగ్, శివానంద్‌గౌడ్ తదితరులున్నారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

కాచిగూడ: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆగస్టు 2 న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షుడు సంఘమేశ్వర్ ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ మహాధర్నా' పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరశైవ లింగ బలిజలను బీసీ జాబితాలో నమోదు చేశారని అప్పటి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లు రాజకీయం, సామాజిక, ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారన్నారు. కేంద్రస్థాయిలో ఓబీసీ జాబితాలో లేనందువల్ల విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నేషనల్ బీసీ కమిషన్ నుంచి నివేదిక అందజేసి రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ఓబీసీ జాబితాలో చేర్చే ప్రయత్నం చేయలేదన్నారు. లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని తాను కూడా పార్లమెంట్‌లో పోరాడుతానని కృష్ణయ్య పేర్కొన్నారు. వీర శైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడు ఈశ్వరప్ప, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, శెట్టి శివకుమార్, దినేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సమస్యల పరిష్కారమే లక్ష్యం

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి రాజకీయాలకు తావు లేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మీ కోసం ఎమ్మెల్యే పాదయాత్రలో భాగంగా 18వ రోజు శనివారం రామంతాపూర్ పరిధిలోని కేసీఆర్‌నగర్ జనప్రియ అపార్టుమెంట్స్ గాంధీనగర్, అరవింద్‌నగర్, శ్రీరామకాలనీ తదితర బస్తీలు, కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో రామంతాపూర్‌లోని పెద్ద చెరువు నుంచి వచ్చే వరదల నివారణకు రూ.10 కోట్లతో నిర్మించిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులను తక్కువ కాలంలోనే పూర్తిచేసి వరదల బాధ లేకుండా చేశామన్నారు. స్థానిక సంక్షేమ సంఘాల నేతలతో పాటు టీఆర్ఎస్ నేతలు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరికె సుధాకర్, మహ్మద్ ముస్తాక్, సంపత్, నరేష్ పాల్గొన్నారు.

స్థానిక జిల్లా సెంటర్లను కేటాయించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో గురుకుల పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్షల కోసం అభ్యర్థులకు ఒకే జిల్లాలో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల పోస్టుల పరీక్షలను నిర్వహిస్తున్న తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు పెట్టారన్నారు. దీంతో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఒక్కో పరీక్ష ఒక్కో జిల్లాలో సెంటర్లు పడటంతో అభ్యర్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురుకులాల్లో 9210 పోస్టుల భర్తీకి 2.66 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో చాలామంది అభ్యర్థులకు మూడు పరీక్షలు, మూడు జిల్లాల్లో సెంటర్లను కేటాయించడంతో అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారన్నారు. దీంతో చాలామంది అభ్యర్థులు నష్టపోతారని అభ్యర్థులకు ఒకే జిల్లాలో పరీక్షాకేంద్రాలను కేటాయించాలని ఒక పరీక్షకు, మరో పరీక్షకు మధ్య మూడు రోజుల గ్యాప్‌ను ఉంచి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల వైద్యానికి భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన రూ.3.33 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు.

- గోల్నాకలోని అన్నపూర్ణనగర్‌కు చెందిన సుజాతకు సీఎం రిలీఫ్ ఫండ్‌పథకం కింద మంజూరైన చెక్కును బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ కార్పొరేటర్ కార్యాలయంలో అందజేశారు.

పుస్తకావిష్కరణ

అంబర్‌పేట: సుపరిపాలనకు ఆదర్శం సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. రచయిత మేలంటి మధు సీఎం కేసీఆర్‌పై 'ఉద్యమనేత – సంక్షేమ ప్రదాత, దేశానికి దిక్సూచి కేసీఆర్' అనే పుస్తకాలను రచించారు. వీటిని శనివారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి రచనలు భవిష్యత్‌తరాలకు అందించాలని ఆయన కోరారు. రచయిత, బీఆర్ఎస్ నాయకులు గెల్వయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రేషన్ డీలర్లకు రూ.50 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

క్వింటాకు రూ.440 కమిషన్‌కు డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో ఐదు లక్షల మంది రేషన్ డీలర్లకు నెలకు రూ.50 వేల గౌరవ వేతనం ఇవ్వాలని లేనిపక్షంలో క్వింటాకు రూ.440ల కమిషన్ ఇవ్వాలని అఖిల భారత చౌకధరల దుకాణాల డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షుడు కాచం కృష్ణమూర్తి గుప్తా డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ షాపుల్లో ఇచ్చే నిత్యావసర సరుకులను పెంచాలని, దేశవ్యాప్తంగా రేషన్ వ్యవస్థ ఒకే విధంగా ఉండాలన్నారు. డీలర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు కేంద్ర పౌర సరఫరాల సహాయమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ప్రధాన కార్యదర్శి బిశ్వంబర్, కోశాధికారి ధరణిధర్, ఉపాధ్యక్షులు ప్రహ్లాద్, గిరిజారావు, జ్యోతిందర్‌సింగ్ పాల్గొన్నారు.



కృష్ణమూర్తి గుప్తా

'ప్రతిపక్షాలు బురద రాజకీయాలు మానుకోవాలి'

ముషీరాబాద్: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బురద రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు హితవుపలికారు. శనివారం విద్యానగర్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుంటే విపక్షాలు జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నాలకు దిగుతున్నారని విమర్శించారు. 24 గంటలు సెలవులు కూడా మానుకోని జీహెచ్ఎంసీ సిబ్బంది పనిచేస్తుంటే వారి ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు మాట్లాడొద్దని ప్రతిపక్షాలను ఆయన కోరారు.

సాహిత్యం ఉన్నంతకాలం సినారె రచనలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ తదితరులు

ముషీరాబాద్: తెలుగు సాహిత్యంలో తనదైన శైలిలో ఎన్నో రచనలు అందించిన మహనీయుడు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. శనివారం సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సినారె చిత్రపటానికి నివాళులర్పించారు. ముఠా జైసింహ, వై.శ్రీనివాస్‌రావు, శంకర్ గౌడ్, రహీం, ఆర్.శ్రీనివాస్, సాయి, ప్రవీణ్ ఉన్నారు.

371-డీ సవరణతోనే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ సమస్యకు పరిష్కారం

లాలాపేట: భారత రాజ్యాంగంలోని అధికరణ 371–డీని సవరణ చేయడం ద్వారానే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఓయూ లా కళాశాల డీన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ దండోరా ఆధ్వర్యంలో చేస్తున్న డిమాండ్ నెరవేరకపోవడానికి ప్రధాన కారణం ఆచరణ సాధ్యం కాని డిమాండ్లే అని పేర్కొన్నారు. రాజ్యాంగ అధికరణ 371–డీను సవరించాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లో రెండొంతు మెజార్టీ, 50 శాతం రాష్ట్రాల్లో అసెంబ్లీ తీర్మానం జరగాల్సి ఉంటుందని కానీ ప్రస్తుతం ఇది జరిగే పరిస్థితి లేదన్నారు. జఠిలమైన కశ్మీర్ సమస్యను 370 అధికరణ రాష్ట్రపతి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో పరిష్కరించనట్లుగానే రాష్ట్రపతి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లను రెండు తెలుగు రాష్ట్రాల్లో జోనల్ పద్ధతి ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

వరదనీరు తొలగింపు

కాచిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై నిలిచిన నీటిని జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, బీఆర్ఎస్ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్‌లు జీహెచ్ఎంసీ సిబ్బందితో తొలగింపజేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం కాచిగూడ స్టేషన్ రోడ్డు, చెప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన నీటిని తొలగించినట్లు వారు పేర్కొన్నారు.



వర్షపు నీటిని తొలగింపజేస్తున్న దిడ్డి రాంబాబు



రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

ప్యాచ్‌వర్క్స్ చేపట్టండి !

కాచిగూడ: రోడ్లపై గుంతలు ఏర్పడి స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. ప్యాచ్‌వర్క్స్ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ పరిధిలోని రహమత్‌బాగ్, భూమన్నలేన్, కుద్బిగూడ తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలప్రసాద్, కృష్ణ, రాము, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, సూరి, రవియాదవ్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో సుప్రభాతసేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం అఖండ దీపారాధన, వేదపారాయణం, రంగారావు, ప్రసాదరావు, హోమం నిర్వహించారు. శ్రీవారి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు సుబ్రహ్మణ్య శాస్త్రి, వేదుల కనకదుర్గా పాల్గొన్నారు.

వర్షం తగ్గినా.. సమస్యలు తగ్గలే

అడ్డగుట్ట: వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పేర్కొన్నారు. శనివారం డివిజన్‌లోని నార్త్ లాలాగూడ, ఇందిరానగర్, శేషాపహాడ్ తదితర ప్రాంతాల్లో ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు తగ్గినా కూడా మురుగునీటి ప్రవాహం, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, దెబ్బతిన్న రోడ్ల సమస్యలను పరిష్కరించడంలో స్థానిక కార్పొరేటర్ విఫలమైయ్యారని ఆరోపించారు. ఇళ్లలో నుంచి బయటకు వెళ్లాలంటే మురుగు నీటిలో నుంచే నడవాల్సిన పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో శంకర్, నాగేశ్వర్‌రెడ్డి, వీరన్న, ప్రకాష్ గౌడ్, శారద, ఉదయ్, శివాజీ, వేణు పాల్గొన్నారు.



నార్త్‌లాలాగూడలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

100 పడకల ఆస్పత్రిని నిర్మించాలి

అడ్డగుట్ట: స్థానిక ప్రజల సౌకర్యార్థం అడ్డగుట్టలో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అడ్డగుట్టలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మారేడుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా ప్రయోజనాలకు వాటిని ఉపయోగించాలన్నారు. 1978–79లో అడ్డగుట్ట ఏర్పాటైనప్పటి నుంచి ప్రభుత్వ భూముల పరిరక్షణకు సీపీఎం పార్టీ ఎంతో కృషి చేస్తూ వచ్చిందని కానీ.. కొంత కాలంగా మండల పరిధిలోని అనేక ప్రభుత్వ భూములను సొసైటీల పేరుతో కొందరు, భూములు తమవేనని మరి కొందరు కబ్జాలు చేశారని ఆరోపించారు.దాదాపు 50 వేల జనాభా ఉన్న అడ్డగుట్ట, రెండు లక్షల జనాభా కలిగిన మారేడుపల్లి మండలాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి అనుగుణంగా 100 పడకల ఆస్పత్రికి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు అజయ్‌బాబు, ఆర్. మల్లేష్, గోపాల్, మహేందర్, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

బస్తీ సమస్యలపై నేతలు దృష్టిసారించాలి

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం ఆయన బస్తీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, కలుషిత జలాలు తదితర సమస్యలతోపాటు పక్కనే ఉన్న రైలు కట్ట దిగువ నుంచి విషసర్పాలు బస్తీలోకి చొరబడుతున్నాయని, రైలుపట్టాల వెంబడి ప్రహరీ నిర్మించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని బస్తీవాసులు తెలిపారు. సంబంధిత అధికారులు, రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, బస్తీలోని శివాలయాన్ని అభివృద్ధి చేస్తానని నాగులూరి సాయిబాబా హామీ ఇచ్చారు.

స్వచ్ఛ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కాలమడుగు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరాన్ని రోజూ స్వచ్ఛంగా ఉంచడానికి స్వచ్ఛ ఆటో కార్మికుల పాత్ర కీలకంగా ఉందన్నారు.

- 2015–16 సంవత్సరంలో సీఎం కేసీఆర్ చెత్త సేకరణ కోసం స్వచ్ఛ ఆటోలను అందించారని తెలిపారు.
- గడిచిన ఏడేళ్లలో ఈ ఆటోలు పూర్తిగా దెబ్బతిన్నాయని స్వచ్ఛ ఆటోల కండీషన్ సరిగ్గా ఉన్నప్పుడే చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుందని వివరించారు.
- కొత్తగా 2500 స్వచ్ఛ ఆటోరిక్షాలు అందించాలని, చాలా మంది కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని వారికి హెల్త్‌కార్డులు అందించాలన్నారు. స్వచ్ఛ ఆటోకార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలల్లో నేరుగా అడ్మిషన్ ఇవ్వాలని కోరారు. డంపింగ్ యార్డు మెయిటెన్స్ జీహెచ్ఎంసీ చేయాలన్నారు.
- వర్షంలో కూడా సేవలందిస్తున్న కార్మికులకు రేయిన్ కోర్టులు అందించాలన్నారు.

యూనియన్ జీహెచ్ఎంసీ అధ్యక్షులు గోపాల్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హంసరాజు, అర్జున్‌శేఖర్, పరశురాం, ప్రవీణ్, శేఖర్, రమేష్, పకీరప్ప, మచ్చగురి, శివ, పుల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కాలమడుగు రాజేందర్